

పంజరం విడిచిన పక్షి

మాదిరెడ్డి సులోచన

ఆర్థిక ఇబ్బందులవలన ట్యూషన్లు చెప్పాలే తప్పితే దానంత నరకం మరొకటి ఉండదు. పిల్లలు ట్యూషన్ మాష్టారనగానే తమ హోమ్‌వర్క్ చేసే కూలీ అనుకుంటారు. వారికి ఒక్క మార్కు అటు, ఇటుగా వస్తే నిలేసి తల్లి. తండ్రులు అడుగుతారు.

ఈ సంవత్సరం ట్యూషన్లు చెప్పాలని లేకపోయినా స్నేహితుడు బలవంతం చేశాడు.

"చెల్లాయి వివాహం, తమ్ముడి చదువుకోసం అని శ్రమపడ్డానురా. ఇక విశ్రాంతిగా ఉండాలని ఉంది."

"అది కాదురా ఆనంద్! ఈ ట్యూషన్ చెప్పి చూడు. పిల్లలంతా తెలివయినవారే. వారిని ఒక గంట చదివించడమే నీ పని." వేణు బలవంతం చేశాడు. మా ఇద్దరి మధ్య ఉన్న స్నేహాన్ని పురస్కరించుకుని, వాడి మాట కాదనలేక శ్రీపతిగారింటికి ట్యూటర్‌గా వెళ్లాను. వేణు చెప్పింది నిజమే. ఆయన రెండుగంటలకు వందరూపాయలు ఆఫర్ చేశారు. ముగ్గురు పిల్లలకు ట్యూషన్ చెప్పాలి. అదికాక ప్రతిరోజూ కాఫీ, ఫలహారం వచ్చేవి. 'ఏమండీ! ఈ నెల వీడికి చాలా తక్కువ మార్కులు వచ్చాయని' గుణిసేవా రెవరూ లేరు.

"హల్లో ఆనంద్!" చిరునవ్వుతో కన్పించినప్పుడు మాత్రం పలుకరించే

వారు. ఆయన కంట్రాక్టరేకాక చాలా వ్యాపారాలు, వ్యాపకాలున్న మనిషి. ఇంకా ఇంట్లో ఎవరుంటారో తెలియదు. నేను వెళ్లేసరికి రమేష్, సురేష్, సుధ పుస్తకాలతో స్టడీరూమ్‌లో కూర్చుంటారు. అరగంట గడిచేసరికి ఫలహారం, కాఫీ వస్తుంది. నెల కాగానే రమేష్ సీలు చేసిన కవరు తెచ్చి ఇస్తాడు. అందులో వందరూపాయ లుంటాయి.

"రోజూ ఫలహారం యెందుకూ?" ఓ రోజు పనివాడిని కసిరాను. వాడు వినయంగా చెప్పాడు.

"అమ్మగారు పంపారు." నా పై అంత అభిమానం చూపే అమ్మగారిని చూడాలని అన్పించింది. పెద్దింటి స్త్రీలను పిలిచి చూస్తానని యెలా చెబుతాను! ఆ ఇల్లాలి రూపం నా మన్యపలకంమీద ఊహాచిత్రం రూపం దిద్దుకుంది. పసుపు కుంకుమలతో కలకలలాడే నిండు ముత్తయిదువు. ఆమె కన్పిస్తే, ఒక్కసారి చెయ్యెత్తి నమస్కరించాలని పించింది. ప్రతిరోజూ ఫలహారం చేస్తూ, నా ఊహాలలో అతి గౌరవ స్థానం ఆక్రమించుకున్న స్త్రీమూర్తికి నమస్కరించేవాడిని.

ఆ రోజు చాలా సేపు ఉండి పోయాను. ఫస్ట్‌టర్మ్ పరీక్షలు జరుగుతున్నాయి. వారికి ప్రశ్నలు జవాబులు రాయిస్తున్నాను. శ్రీపతిగారి మేఘగర్జన విన్పించింది. వెంటనే స్త్రీ ఆర్తనాదం, గందరగోళంగా ఉంది. ఏమిటని పిల్లలను అడగటం అంత సంస్కారం కాదని కూడా తెలుసు.

"అమ్మను కొడుతున్నారు..." సుధ గుసగుసగా వాళ్లన్నతో అనటం విన్పించింది. ఒక్కసారి వారివంక చూచి వచ్చేశాను. మరో రోజు అమ్మ ఊరు వెళ్లాలి, రెండువందల రూపాయలు కావాలని అన్నది. గంటలో అంత డబ్బు శ్రీపతిగారే తప్ప యెవరూ సర్దుబాటు చేయరని తెలుసు. గబగబా వెళ్లాను. ఇల్లంతా గందరగోళంగా ఉంది. శ్రీపతిగారు ఉగ్రరూపం దాల్చి బయటికి వచ్చాడు. నన్ను చూచి ఉలిక్కిపడటం గమనించాను.

"యెప్పుడొచ్చావ్ ఆనంద్?"

"ఇప్పుడే వస్తున్నాను." అతని ముఖంపై చిరునవ్వు వెలసింది.

"ఈరాత్రి మీకు శ్రమ ఇస్తున్నాను. అర్జంటుగా ఊరు వెళ్లాలి. ఓ రెండు వందల రూపాయలు కావాలి."

"దానికేమోయ్! పట్టుకెళ్లు." వెంటనే జేబులో చేయిపెట్టి వందరూపాయల నోట్లు యిచ్చారు. ధన్యవాదాలు అర్పించి మెట్లు దిగుతుంటే పైభాగంనుండి మూల్గు విన్పించింది, శ్రీపతిగారు భార్యను యెందుకు హింసిస్తారో అర్థంకాలేదు.

దీపావళిరోజు భోజనాలకు పిలిచారు. లక్ష్మీపూజ, మర్నాడు సత్యనారాయణ వ్రతం. సాధారణంగా, వ్రతాలు,

పూజలు అంటే తప్పించుకునే నేను, ఆ రోజు ప్రత్యేకంగా వెళ్లాను. నా పై అంత అభిమానం చూపే మాతృమూర్తిని చూసి నమస్కరించాలని. హాలునిండా ఆశ్రిత జనులు, బంధువులు, స్నేహితులు కూర్చుని ఉన్నారు. జరీ పంచె కట్టుకుని శ్రీపతిగారు హుందాగా తిరుగుతున్నారు.

"రండి అయ్యగారూ..." అంత వరకు పూజ సామాగ్రి అమరుస్తున్న బ్రహ్మడు పిలిచాడు "చిన్నతల్లి అమ్మగార్ని పిలువు " సుధతో బ్రాహ్మడు చెప్పాడు. శ్రీపతి కూర్చున్నాడు. నేను కుతూహలంగా చూస్తున్నాను.

హాల్లో వెయ్యివాట్ల బల్బు వెలిగింది. ముదురాకుపచ్చ పట్టుచీరలో అప్పుడే అరవిచ్చిన గులాబిలా ఉందో యువతి. తలవంచుకుని వెళ్లి శ్రీపతి ప్రక్కనున్న పీటపై కూర్చుంది. నా వెన్ను జలదరించింది. ఈ మెరుపుతీగె అతని భార్యా! ఇది కలా? బ్రాహ్మడి మంత్రాలు కర్ణ కఠోరంగా విన్పించాయి. మరోసారి అటు చూశాను. తీరుగా ఉన్న మెడపై ముత్యాలహారం వెలవెల బోతుంది. వీపుమీదగా జారిన జడ నేలపై జీరాడుతుంది. మరొక్కసారి ఇటు తిరిగితే! నేను కోరుకున్నట్టు ఆమె తిరుగలేదు. యెదుటి విగ్రహాలపై ఏకాగ్రత నిలిపినట్టు ఒకే చోట ముడుచుకుని కూర్చుంది. కుడిచేయి మాత్రం ముందుకులేచి పసుపు, కుంకుమ, పూలు మంటపంలో పెడుతుంది.

సత్యనారాయణ, నిత్యపారాయణ

ముత్యాల హారతిదే...నీకు పచ్చలా హారతిదే?

ఎవరో ముత్తయిదువు పాటకు ఈ లోకంలోకి వచ్చాను. ఒకటిన్నర గంట ఆ సుందర విగ్రహాన్ని చూస్తూ గడిపాను. ఛ...ఛ—నాలోని సంస్కారం ఏమయింది? పరాయి స్త్రీనిగూర్చి మధురంగా ఆలోచించటమా! ఆమె లేచి, స్త్రీలున్నచోటికి పోబోయింది. అందరి కళ్లు ఈర్ష్యగా చూస్తున్నాయి.

"ఏమేయ్...నిన్నే!" శ్రీపతిగారి కంఠం కర్కశంగా విన్పించింది. ఆమె వెనుతిరిగింది. ఆ తిరగడంలో ఓ ప్రత్యేకత, అందం కన్పించాయి.

"ఈ ప్రసాదంపళ్లెం పట్టుకు వెళ్లు." అది తీసుకుని, మాయం అయినట్టు వేగంగా తప్పుకుంది. భోజనాలకు కూర్చున్నాం. పదార్థాలు చేదుగా, విషం మింగినట్టు అన్పించాయి. వెళ్లిపోతే సభ్యతగా ఉండదని కూర్చున్నాను. మరొక్కసారి ఆ మూర్తి...ఆ అప్సర.. దర్శనం అవుతుందేమోనని చూచాను. బయట వేసిన షామియానాలో అందరూ కూర్చున్నారు. నేను హాల్లోనే ఓ కుర్చీలో కూర్చుని, ఫిల్మ్ ఫేర్ తిరగెయ్యసాగేను.

"మాష్టారూ! తాంబూలం" సుధ చిన్న వెండి పళ్లెంతో వచ్చింది. అప్రయత్నంగా తల ఎత్తాను. ఎదురు తలుపులో చిరునవ్వుతో నిల్చున్న మెరుపుతీగె మాయం అయింది.

"తీసుకోండి."

తీసుకున్నాను. అది తియ్యగా. అమృతంలాగా తోచింది. సుధను దగ్గరగా పిలిచాను.

"తాంబూలం యెవరిచ్చారు?"

"అమ్మ ఇచ్చింది." ఆ మాట నాకు కర్ణకఠోరంగా విన్పించింది.

అమ్మలు...అమ్మ అనుకున్నాను

"మీ అమ్మ పేరు?"

"హేమలత" సుధ యెవరో పిలిచినట్టు పరుగులుపెట్టింది. నా మతి పోసాగింది. యెంత చక్కని రూపం! రూపానికి తగిన పేరు. శ్రీపతి మాత్రం ఆమెకు తగిన భర్త కాడు.

"ఒంటరిగా ఉన్నావేం ఆనంద్?" అతని మాటలకు ఉలికిపడ్డాను ఆ తరువాత యెన్నోసార్లు కావాలనే పని కల్పించుకుని చాలాసేపు ఉండి పోయేవాడిని. వారంలో రెండు, మూడుసార్లు శ్రీపతి గర్జింపులూ ఆమె ఆర్తనాదాలు విన్పించేవి. అతను కొట్టే ప్రతి దెబ్బ నా హృదయంపై పడినట్టే అన్పించేది. కావాలని పిల్లల చదువుపై అత్యంత శ్రద్ధ చూపసాగేను. ఒకోసారి పరధ్యాసగా ఆలోచించేవాడిని. గబగబా ఇంట్లోకి వెళ్లి శ్రీపతిని నాల్గు తన్ని ఆమెను హృదయానికి హత్తుకోవాలని పించేది. వెంటనే విచక్షణ మేలుకునేది. కొందరు స్త్రీలకు దెబ్బలు తినటం కూడా ఒకవిధమయిన సుఖాన్ని ఇస్తుందట. ఆమె ఆ కోవకు చెందినదేమో! ఓ రోజు గేటుదగ్గర నిలబడిన పనిమనిషిని చూచాను.

"యెల్లిపోతున్నారా పంతులోరూ?"

"ఏం తీరికగా ఇక్కడున్నావ్?"

"ఆ ఇంట్లో జరిగే భాగోతం రోజు సూడాల. ఓ పున్యకత కాదు, కీర్తన కాదు." విసుక్కుంది.

"శ్రీపతిగారంత మంచివారు కదా? ఆమె నలా యెందుకు చావగొడతారు?" ధైర్యంచేసి అడిగాను.

'ఆయన మొగమారాజు. ఏంజేసినా చెల్లుతుంది. ఆయన సొమ్ముజూసి పెండ్లి చేసుకున్నది ఆడదానిలా పడి ఉండొద్దూ! రోజూ సాకులే! అక్కడికి చిలక్కి చెప్పినట్టు చెప్నా? ఆయన ముందల్తో పోతాడంట...మరదలితో కులుకుతాడంట. మొగోడు, ఆయంతో పందెమా?"

నా కొల్లు మండిపోయింది. మొగోడు అంటూ ఓ వంక పురుషునికి పట్టంకడు తూనే, మళ్లీ స్త్రీకి అన్యాయం చేస్తున్నారని. తెల్లకాగితాలు నలుపుచేస్తూ వ్యాసాంమీద వ్యాసాలు రాస్తారీ మహిళా



మణులు. పైనుండి సన్నగా ఏడ్పు వినిపిస్తూనే ఉంది.

"అంత అందమయిన భార్య ఉండగా ఆయన బయట యెందుకు తిరుగుతారు ?" అన్నాను.

''ఏం సత్యకాలం మనుషులయ్యా ! రుసులు బాబా...రుసులు. ఇంట్లో యెంత కమ్మగ ఉన్నా హోటేలుకెళ్లరు..." వేదాంతం చెబుతున్నట్టు నవ్వింది. భారంగా అక్కడినుండి కదిలిపోయాను. అమ్మ చెల్లిని పురుటికి తీసుకువచ్చింది. తాత్కాలికంగా అన్నీ మరచిపోయాను. చెల్లితో కబుర్లు చెప్పుకుంటూ గడిపేవాడిని.

"అన్నయ్యా !"

"ఏమ్మా ?"

"అమ్మ నీ గురించి చాలా దిగులు పడుతుంది."

"దిగులా ! యెందుకు ?"

"పెళ్ళి చేసుకోవటం లేదని."

"దిగులెందుకే ? కొన్నాళ్లు సుఖంగా ఉంటాం."

"మేమంతా మా అత్తగారిళ్లలో సుఖశాంతులు కరువు చేశామన్నమాట !" అంది కోపంగా.

"ముక్కు మీద కోపం..." అన్నాను.

"చెప్పరాదు అన్నయ్యా ! పోని నీ మనసులో యెవరున్నారో చెప్పు." నా మనసులో ఉన్నవారి సంగతి చెబితే ఇంకేమయినా ఉందా ?

''నన్ను వెతకమంటావేమిటి ?"

''అంత పని మాత్రం చెయ్యబోకు" అన్నాను భయం నటిస్తూ. మర్నాడు చెల్లి పట్టుబడితే, ఆమెను తీసుకుని కాచిగూడా, ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లాను. ప్రసాదం తీసుకుని బయటకు వస్తుంటే, చెల్లాయి స్నేహితురాండ్రు కన్పించారు. వారు కబుర్లలోపడి నా మాటే మరిచిపోయారు. నెమ్మదిగా

ఒక్కొక్క మెట్టు దిగుతూ, చేతిలో కొబ్బరి ముక్కలు యాచకులకు పంచి పెట్టాను.

"ఆనంద్ బాబూ !"

ఇంత మధురమయిన కంఠం యెవరిది ! నన్ను అలా పిలిచేవా రెవరు? వెనుదిరిగాను. కారు తలుపులు తీసుకుని నిల్చుంది హేమలత ! నా స్వప్న సామ్రాజ్యంలోని మహారాణి.

"నన్ను గుర్తించలేదా ?" అన్నది చిన్నబుచ్చుకుంటున్నట్టు.

"లేదు. అకస్మాత్తుగా చూచానా... అందుకే. ఆలయానికి వెళ్లరా ?" అన్నాను దగ్గరగా చూడటంవల్ల మతి పోతుంది నాకు.

"భగవంతడు కూడా లంచాలుంటేనే కనికరిస్తాడు నా దగ్గర ఏముందని అతనికి లంచంపెట్టను ! నేను అసహ్యించుకునేవి...ఏవయినా ఉంటే భగవంతుని పేరు...మాతృ మూర్తి... కన్నతల్లి అని పూజ చేస్తారే ఆ తల్లి పేరు..."

"మీరు ఆవేశపడుతున్నారు."

"ఓహ్ ! పరిసరాలే గుర్తుండవు సంవత్సరాని కోసారి అరుదుగా లభించే స్వేచ్ఛలో" అంది యెటో చూస్తూ.

"భగవంతుని పేరు పతనివారు, ఆ రోజు అంత కుదురుగా పూజ చేశారేం?"

"ఆ మాత్రం ఊహించలేరా ? దెబ్బలకు అలసిపోయిన శరీరానికి కాస్త సుఖం ఇద్దామని..."

"ప్రతిరోజూ నా కోసం ఫలహారాలు పంపి శ్రమపడుతున్నారు."

"నాకు ఆనందం కలిగించేది అదొక్కటే అంటే మీరు నమ్మతారా.." అంటూనే చటుక్కున వెళ్లి కార్లో కూర్చుని మరో దిక్కుకు చూడసాగింది. ఏమిటా అని వెనుతిరిగాను. ఓ వయసులో ఉన్న విధవరాలు, ఓ పుణి స్త్రీ దిగివస్తున్నారు. వారి వెనకాల డ్రయివరు ప్రసాదంపళ్లెం పట్టుకు వస్తున్నాడు. అక్కడ నిల్చోడంబావుండదని అప్పుడే ఆలయానికి వెడుతున్నట్టు పైకి వెళ్లిపోయాను. ఏదో అసంతృప్తిగా ఉంది. నన్నారాధించే స్త్రీని తర్వగా వదిలిపెట్టినందుకు కాబోలు ! స్త్రీల పట్ల ఘనీభవించే నా హృదయంలో తీయని స్పందన ప్రారంభం అయింది.

ఆ రోజు మామూలుగా ఫలహారం చేస్తున్నాను. సమోసాల మధ్యనో కాగితం కన్పించింది. నెమ్మదిగా తీసి జేబులో వేసుకున్నాను. ఆ రోజు కాలం స్తంభించిపోయినట్టుగా అన్పించసాగింది. పాఠం పూర్తిచేసి బయటపడ్డాను. ఇంటికి వెళ్లేవరకు ఓపికలేదు. ఉత్తరం విప్పాను.

'ఆనంద్

నిన్నేమని సంబోధించాలి ? నా ఊహా లోకంలోని రాజకుమారుడివనా, లేక

నాకీ పంజరంనుండి విముక్తి కల్గించ టానికి అవతరించిన దేవతామూర్తి వనా ? మౌనంగా నీ మధురమైన గొంతు వినటం నా కార్యకలాపాలలో ఒకటి. నీవు సుధకు రాయించిన వ్యాసం చదివాను. స్త్రీ పట్ల మీకున్న పూజ్య భావం సానుభూతి చూచి ఈ ఉత్తరం రాస్తున్నాను. నాకీ ఇంటినుండి విముక్తి కావాలి. నాకు మార్గదర్శకులు మీరు కావాలి. ఈ నరకంలో ఉండలేను. అమ్మ ఆశలకు బలి అయ్యాను. నల్గురి పరాయి స్త్రీలతో తిరిగే శ్రీపతి నన్ను కొన్నాడు. అతనంటే నాకు అసహ్యము, ద్వేషము. మిమ్మల్ని గేటులో మొదటి రోజు మేడపైనుండి చూచాను. వెంటనే తెలియని మధుర భావమేదో నన్ను ఆవహించింది. అపవిత్రమైన శరీరం అక్కరలేదనుకుంటే నాకేదో బ్రతుకు తెరువు చూపండి.

మీ

హేమ.''

నా ఒళ్ళంతా ముచ్చెమటలు పోశాయి. నన్ను కటకటాల వెనక్కి తోయించ టానికి అయిదు నిమిషాలు పట్టదు శ్రీపతికి. నా హృదయంలో కదలాడే అవ్యక్తమైన భావాలకు హేమ రూప కల్పన చేసింది. సంకోచాలు అన్నీ వది లేశాను. నేను ఏ పనిచేసినా అమ్మకు

చెప్పి చేయాల్సిందే. దొంగచాటు వ్యవహారాలంటే విపరీతమైన చికాకు. చెల్లాయి పురుటికి సహాయం చెయ్యటానికి వదిన కూడా వచ్చింది. అందరిముందు నా నిర్ణయం తెలిపాను. "ఏంట్రా ! మతిగాని పోలే కదా ? దేశం గొడ్డుపోయిందా ? వివాహం కాని కన్యలే లేరా ?"

"మరిదీ ! సంఘ సంస్కర్తవు కావాలనుకుంటే ఇలాంటి పనులే చేయాలని ఏంలేదు." వదిన వెటకారం చేసింది. "యెంత విడ్డూరం ! ఒకసారి వివాహం అయిన స్త్రీ మళ్లీ పెళ్లికెలా అంగీకరిస్తుందయ్యా ?" అసహ్యంగా, ఆశ్చర్యంగా చూసింది.

"సంఘ సంస్కరణ ! అలాంటి పెద్ద మాటలు వద్దులే వదినా !" అన్నాను. పోయిన నెలలో "స్త్రీ-స్వాతంత్రం" అంటూ వ్యాసం రాసి ప్రథమ బహుమతి కొట్టేసిన, వదిన నేతి బీరకాయ చందమని ఈనాడే తెలిసింది

"మతిపోయిందా అన్నయ్యా ! అది ఆడదా, గాడిదా ? పిన్నికీ పెదనాన్నకెంత తేడా ? కిక్కురుమనకుండా కాపరం చెయ్యలేదూ ?" చెల్లాయి నీరసనగా చూచింది. నాకు నవ్వు వచ్చింది.

"అవివాహితలూ - మాతృత్వము." అంటూ రాత్రంతా కష్టపడి స్త్రీలకు అనుకూలంగా రాసిన చెల్లాయి, మన దేశంలో, నాయకుడి దగ్గరనుండి కర్షకుడివరకు ప్రాకిపోయిన జబ్బు ఏదయినా ఉంటే చేతలకు మాటలకు యెక్కడా పోలిక లేకపోవటమే. ఒక స్త్రీని సహృదయంతో అర్థంచేసుకోలేక నెరజాణలు, స్త్రీ కన్యగా ఉండి, తల్లి అయితే గౌరవిస్తారట ! పూజిస్తారట !

అమ్మ గొణుక్కుంటూనే ఉంది. చెప్పటం నా ధర్మం అనుకున్నాను. వేణుతో విషయమంతా చెప్పాను. వాడికి ఇష్టం లేకపోయినా, తన గౌరవం నిలుపుకోవటాని కన్నట్టు అంగీకరించాడు. హేమను ఆ యింట్లోనుండి తప్పించడం యెలా ? శ్రీపతిగారితో ముఖాముఖి తలపడే ధైర్యం లేదు. మామూలుగా అయిందిటికే ఆయనిల్లు చేరాను. ఏనాడూ లేనిది ఆ సమయంలో ఆయన కారు కన్పించింది విశేషం ఏమిటా అనుకుంటూ వరండాలో అడుగుపెట్టాను. లోపలినుండి గొడవగా కొన్ని గొంతులు విన్పిస్తున్నాయి. "నిన్నే ! కాంతంకెదురు చెప్పే గుండెలా నీకు ?" శ్రీపతిగారి గొంతు. "ఆవిడపై అంత అభిమానం ఉంటే, ఆవిడతో ఊరేగండి. నేను యెవరి దాసిని కాను." నిర్భయంగా, అయినా మధురంగా ఉంది హేమ గొంతు.

"అదొక్కటే కాదు. ఆ పంతులు గాడికి రోజూ దేవుడికి ప్రసాదం పంపినంత భక్తిగా కాఫీ, ఫలహారాలు పంపుతుంది." కాంతంలా ఉంది. ఆవిడ శ్రీపతి విధవ మరదలు.

"నీకంటే నీతిమాలిన దాన్ని కానులే అక్కయ్యా..." అంతే. దబ్బుమని క్రిందపడిన చప్పుడు, ఆ వెంటనే హేమ ఆర్తనాదం విన్పించాయి. ఆగలేక పోయాను. కర్టెను తొలగించి లోపలికి వెళ్లాను. నేలమీద పడిన హేమను, వాకింగ్ స్టిక్‌తో అడ్డదిడ్డంగా బాదే స్తున్నాడు. వెనుకగా వెళ్లి అతన్ని ఆపాను.

"ఆనంద్ !...నువ్వు...నువ్వా ?"

"నేనే...బలవంతులయిన మీరు ఒక అబలపై చేయిచేసుకోవటమా ?'

"ఊఁ..."అతను నన్నూ, హేమను మార్చి మార్చి చూశాడు. నా దృష్టి హేమ నడుము దగ్గర ఆగిపోయింది. ఎర్రగా కంది రక్తం చిందేలా ఉంది. ప్రాకుతూ ముందుకు జరిగింది, రెండు చేతులు జోడించింది.

"ఆనంద్‌గారూ ! మీ పాదాలకు నమస్కరిస్తాను. నన్ని నరకంలోనుండి తప్పించండి" అత్యంత దయనీయంగా ఉంది.

"కాంతం చెప్పింది నిజం అన్న మాట." అతని కళ్లు నిప్పులు కురు స్తున్నాయి. బెత్తం ఎత్తాడు. దాన్ని లాగి అవతల పారేశాను

ఇద్దరం ప్రత్యర్థుల్లా చూసుకున్నాం.

''నువ్వెవడవోయ్ !"

"పౌరుడిని. ఒక నిండు ప్రాణిని హత్య చేస్తుంటే సహించలేను " అని జోడించిన చేతులుపట్టి లేపాను హేమను. అతను మండిపడ్డట్టు చూచి ముందుకు దూకాడు.

''నీకు మూడిందిరా. నా ఇంట్లో వారిపై, నా ముందే చేయివేస్తావా ?" నా కాలరు పట్టుకున్నాడు. యెక్కడ లేని ధైర్యంతో విదిలించేశాను.

"జాగ్రత్త ! మర్యాదగా మసలుకుని, నీ ప్రవర్తన మారితే హేమలత వస్తుంది. లేదా తన బ్రతుకేదో తను చూసుకుం టుంది'' అన్నాను దృఢంగా.

"ఒహో ! ప్రాణంతో గడప దాట గలననేనా నీ ధీమా ?''

"దివ్యంగా" అన్నాను. ''నే వచ్చిన ఆరు నెలలనుండి చూస్తున్నాను. ఒక్క రోజయినా ఆమెను కొట్టకుండా వదిలావా ?"

"అది మా స్వవిషయం.''

"అచ్చం మియ్యాఖాన్ లాగేమాట్లాడు తున్నారు. మీరు నాపై కేసుపెట్టండి," నిర్లక్ష్యంగా అని, పదమన్నట్టు హేమ వంక చూచాను. ఆమె కుంటుతూ ముందుకు నడిచింది. ఇంట్లోని స్త్రీలంతా శాపనార్థాలు పెడుతున్నారు. డ్రయివరు రంగంలోకి వస్తాడనుకున్నాను. అతను ప్రతిమలా నిల్చున్నాడు. వరండా మెట్లు దిగుతుండగా శ్రీపతి కంఠం కర్కశంగా విన్పించింది.

''ఒక్కసారి గేటు దాటావంటే మళ్లీ గడప త్రొక్కలేవు.''

''ఆ అవసరం రాదు." నీరసంగా జవాబు ఇచ్చింది హేమ.

రిక్షాలో కూర్చున్నాం.

''యెక్కడికి పొమ్మంటారు ?'' నా కేం తోచలేదు.

"మొదట ఏదయినా క్లినిక్‌కు తీసుకు వెళ్లండి." హేమ గొంతు నీరసంగా ఉంది. ఆ తరువాత స్పృహతప్పి పోయింది. మిసెస్ దేశాయి క్లినిక్ ముందు రిక్షా ఆపించి, చేతులపై యెత్తి తీసుకు వెళ్లాను. అప్పటివరకు నేను చూడలేదు. తలపై యెక్కడో చిట్లినట్టుంది. రక్తం నా బట్టలను పాడుచేసింది. మిసెస్ దేశాయి నాకు పరిచయస్తురాలు, అందుకే వెంటనే అడ్మిట్ చేసుకుంది.

"ఎవరు ఆనంద్ ! రాక్షసంగా హింసింపబడింది," అన్నది చేతులు కడుక్కుంటూ. వివరాలు అన్నీ చెప్పాను.

"శ్రీపతిగారి భార్యా ?" ఆమె నోరు వెళ్లబెట్టింది." ఆనంద్ ! ఏ గవర్నమెంటు ఆస్పత్రిలోనో చేర్పించి సర్టిఫికేట్ తీసుకో. ఆయనతో వైరం తెచ్చుకోవటమా ?" అన్నది.

"ఈ రాత్రికి ఉండనివ్వండి రేపు చేర్పిస్తాను.'' హేమ గదిలోకి వెళ్లాను. ఈ సాతి సరిగ్గా చూచాను. అందమైన శరీరంపై యెన్నో గాట్లు, కమిలిన మచ్చలు. ఆమె దయనీయ స్థితికి దుఃఖం వచ్చింది. శ్రీపతి డబ్బున్నవాడు. ఆతను ఏదయినా చేయగలడు. రెక్కల ఆధారంతప్ప మరేం లేని నేను ఆయనతో తలపడటం! సాహసం చేశాను. హేమను యెక్కడుంచాలి ? అమ్మ జవాబు ఇచ్చేసింది నాకు, తనకు ఏంసంబంధం లేదని. చెల్లాయి పాపను కూడా చూడనివ్వలేదు. బడిలో సూటి పోటి మాటలు భరించటం కష్టంగా ఉంది. ఆ రోజే హేమను ఆస్పత్రినుండి డిస్‌చార్జీ చేశారు. ఇద్దరం ఆస్పత్రి ముందున్న గార్డెన్‌లో కూర్చున్నాం.

''మీరు...మీరు బాధపడుతున్నారా?" పాలిపోయిన ముఖంతో అడిగింది.

"నిన్ను తీసుకొచ్చినందుకు కాదు. మన చుట్టూ ఉన్నవారి ప్రవర్తనకు." మృదువుగా ఆమె చేయి నొక్కాను.

"నేను మెట్రిక్ పాసయ్యాను. ఏదయినా ఉద్యోగం దొరకదా ?''

''ప్రయత్నం చేద్దాం" అన్నాను. విడాకులు లభించేవరకు యెక్కడో ఒక చోట ఉంచాలి. సంఘసేవికురాలు, సాంఘిక విప్లవం తెచ్చిన వీరవనిత కరుణామయి గుర్తుకు వచ్చింది. ఉత్సాహంగా లేచాను. రిక్షా చేసుకుని ఇద్దరం ఆమె ఇంటికి వెళ్లాం. ఖద్దరు దుస్తులతో అతి సాధారణంగా ఉన్న ఆమెను చూడగానే నమస్కరించ బుద్ధేసింది. ఓపికగా హేమకథ చెప్పాను. విడాకులు లభించేవరకు ఆశ్రయం ఇవ్వమని కోరాను.

"ఏమయ్యా ! ఇదేం సానికొంప అనుకున్నావా ? ...ఏమ్మా శ్రీపతి

లాంటివారి సహచర్యం మరో జన్మ ఎత్తినా దొరుకుతుందా ? హైదరాబాద్ మొత్తం కొనగలడు " తలవాచే చీవాట్లు పెట్టింది తిరిగిన చోట్లూ, జరిగిన అవమానాలు రాస్తే అదో గ్రంథం అవుతుంది పురుషుల కంటే స్త్రీలే నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించారు పది గంటల రాత్రి హోటలు గది తప్ప మరే ఆశ్రయం దొరకలేదు కలాలు కదలంగానే కాదు, స్త్రీకి తోటి స్త్రీపట్ల హృదయాంతరాళంలోనుండి పుట్టుకు రావాలి సాను భూతి మర్నాడు భారంగా బడికి వెళ్లాను లీజర్ పిరియడ్ ఉంటే స్టాఫ్ రూమ్ కెందుకని బయట చెట్టు కింద కూర్చున్నాను ప్యూన్ నర్సయ్య వచ్చాడు

"మీ కోసం యెవరో వచ్చారు సాక్!"

"ఎవరూ ?" అతని వెనకాల వెళ్లాను శ్రీపతి ముఖం చూచి తల వంచుకున్నాను

'ఆనంద్ !" అతని పిలుపులో కోపం లేదు ఏదో రాజీకి రావాలనే ఆదుర్దా ఉంది

"క్షమించండి శ్రీపతిగారూ ! హేమలత కోలుకుంటే ఆమెను హింసించనని మాటిస్తే మీ వెంట వస్తుంది ''

''అక్కరలేదు ఆనంద్ నాటి పొరపాటే ఈ వయసులో పెళ్లేమిటి? సుధావాళ్లమ్మే ద్వితీయ కళత్రం మీకు స్వయంగా నా చేతుల మీదుగా వివాహం జరిపిస్తాను ''

నమ్మలేక పోయాను ఇదేదో కుతంత్రం కాదుకదా !

"నమ్మకం కలగటం లేదుకదా !" ఆయన నవ్వారు ఆయన మాట ఆయన నిలుపుకున్నారు మర్నాటి పేపర్ల నిండా ఆయన ఫోటోలే ఆయన త్యాగనిరతిని విశాలభావాలను కొనియాడారు 'నేను హేమలతను రక్షించడానికి మరో దారిలేక వివాహం ఆడాను భార్య అనే హక్కుంటే తప్ప స్త్రీ ఒక పురుషుని అండలో ఉండలేదు సరియైన జోడి కుదరాలని ఇన్నాళ్లు చూచాను యువకులకే సాహసం తెగింపు ఉండాలని ఆనంద్‌ను అంగీకరింపజేశాను " ఇలా సాగింది ఆయన స్టేట్‌మెంటు నాకు నవ్వు వచ్చింది ఇదో చదరంగపు ఎత్తు రాబోయే ఎన్నికలకు రాజ మార్గం

"భారతరత్న'' అనే బిరుదు ఇందిరమ్మ కిచ్చారు ఈయన కిస్తే బావుండేది " హేమ పడీ పడీ నవ్వింది

ఇంత పెద్ద పట్టణంలోనూ మాకిల్లు దొరకలేదు మా ఫోటోలు శ్రీపతి పుణ్యమా అని పేపర్లలోకి యెక్కాయి ఒక్కచోట రెండు గదులు దొరికాయి కాని అక్కడి నివసించేవారంతా, సిగరెట్ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు

"హేమా! ఇక్కడ ఉండగలవా?"

"మనసులో కల్మషాలు లేకుండా మోటుగా నాల్గు తిట్టుకున్నా, సాను భూతి, భూతదయ ఉంది వారిలో. నాకేం ఇబ్బంది లేదు, అన్నది హేమ. వారంరోజులలో హేమ అన్నమాట నిజం అని తేలింది. చిరునవ్వుతో గుమ్మంలో నిల్చుండే హేమ కన్పించక పోతే నాకేదో అశుభంగా తోచింది.

"హేమా!"

మూర్తీభవించిన శోకదేవతలా ఉంది ఆమె. ఆమె చాలాసేపు ఏడ్చింది అన టానికి కళ్లు ఉబ్బిఉన్నాయి. ఆదుర్దాగా చేయి పట్టుకున్నాను.

"అసలేమయింది హేమా?"

"మీ అమ్మా, చెల్లి వచ్చారు మిమ్మల్ని వదిలిపోతే వెయ్యి రూపాయలు ఇస్తామన్నారు."

"నువ్వేం అన్నావు?"

హేమ కళ్లు నానుండి ఏం దాచ లేవు. ఆమె ఏమందో అర్థంఅయింది.

"డబ్బు అక్కరలేదు. నేను ఆయన జీవితంలోనుండి తొలగిపోతాను అన్నావు కదూ?" జవాబుగా నా భుజంపై తల వాల్చి వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఇటు చూడు హేమా! నాల్గు సంవత్సరాలు ఏడ్చావు చాలదా?" ఆమెను నా కభిముఖంగా తిప్పాను. "ఇకనుండి నీ పెదవులపై చిరునవ్వే తప్ప కంటిలో తడి నేను చూడ కూడదు."

"ఆనంద్! జీవితాన్ని మనము ఒక కోణంనుండే చూశాం. రెండవ కోణం నుండి ఆలోచించలేదు. రేపు మన పిల్లలు..." పూర్తి చేయలేకపోయింది. నాకు నవ్వు వచ్చింది.

"ఆవేశావేం? మన పిల్లలను వెలి వేస్తారని కదూ నీ భయం. బూజుపట్టిన భావాలు ఒకొక్కటే మలుపుకు పోతు న్నాయి. మన పిల్లల కాలంనాటికి సంఘం ఇలాగే ఉండదు." ఓదార్చాను.

"మీ అమ్మగారు..."

"చెప్పు, అగావేం?"

"ఇరుగు పొరుగులనందరిని పిలిచి యాగిచేశారు. రేపటినుండి వాళ్లు నా ముఖాన పేడ చల్లేస్తారు..." అవును. ఆ యిల్లే కాదు. ఆ ఊరే వదలాలి. ఎలా?

"నా వల్ల మీకు..."

"చాల్లే తెలివి. ." మృదువుగా కసురు కున్నాను. హేమకోసం ఏదయినా త్యాగం చెయ్యాలనే నా ఆరాధన ఆమెకేం తెలుసు!

భోజనం తరవాత హేమవడిలో తల పెట్టుకు పడుకున్నాను. ఆమె ముఖం అలా గంటలు, గంటలు చూడటం నాకు సరదా. అకస్మాత్తుగా డి. ఇ. ఓ. గారి మాటలు తటుక్కున నా మదిలో మెరిశాయి.

"ప్రతివాడు పట్నంలో ఉండాలనుకుంటే యెలా? 'మొండిచింత' అనే ఊరుందయ్యా! సౌకర్యాలు లేవనుకో, మరక్కడ హైస్కూల్ తీశారు కదా! ఒక్క గ్రాడ్యుయేటు వెళ్లడు. ఎవరిని వేసినా ఏదో సాకు, లేదా పైవారి రికమెండేషన్ తెస్తారు. మనం బాగుపడేది యెప్పుడో!"

నిజంగా నేను వెడితే? అవును హేమ సమక్షమే నందనవనం అవుతుంది. ఒకరిని ఒకరం చూస్తూ జీవితాంతం గడపవచ్చు.

"హేమా!" అరిచాను.

"ఏమిటి?" భయంగా చూచింది.

"మనం ఈ ఊళ్లో ఉండం" అన్నాను. మర్నాడుదయమే డి. ఇ. ఓ. గారి దగ్గరకు వెళ్లాను.

* * *

మొండిచింతకు రైలుప్రయాణం చేయాలి. తరువాత బస్సులో ఇరవై మైళ్ల వెళ్లాలి. బస్సు దిగాక పదిమైళ్లు యెడ్లబండిలో ప్రయాణం. మూడు మైళ్లు బండిలో ప్రయాణం చేసేసరికి విసుగు వచ్చింది నా ఒడిలో తలపెట్టి హాయిగా నిదరబోతుంది హేమ. తెలతెలవారుతుండగా ఊరుదగ్గరకు వచ్చాం. హేమ ముంగురులు సవరిస్తుంటే యెన్నో విషయాలు కళ్లముందు కదలాయి. జనవరి ఇరవై ఎనిమిదిన వివాహం, ఫిబ్రవరి పదిహేను లోపలే యెన్ని మార్పులు.

"కులపాంసకురాలు. నా కొడుకును నాశనంచేసింది." అని అమ్మ, "అన్నయ్య ఎంతకు తెగించాడని" చెల్లి అనుకుని ఉంటారు. కోపం తగ్గాక వారే అర్థం చేసుకుంటారు.

"సార్! ఇదిగో ఇదే పెద్ద గుడి. దండం పెట్టుకోండి." బండివాడి హెచ్చరిక విన్పించింది. ఆలయం ముందు బండి ఆగింది. బయట నుండే నమస్కరించాను "భగవంతుడా! నీ ఉనికే సత్యమయితే, ఈ మనుష్యుల్ని, మనుషులుగా చేయి. మాటలకు, చేతలకు సంబంధం ఉండాలని వారిని ప్రేరేపించు" అని ప్రార్థించాను.

"దిగరా సర్?"

"శుచిగా మరోసారి వస్తాను, పద."

ఉషోదయమయింది...మా జీవితాలలో కూడా ఉషోదయం అయినట్టే అన్పించింది. అది మరిచి నిదురబోయే హేమను మైమరచి చూడసాగేను. బండి ఊళ్లో ప్రవేశించింది.